

మన్నించు ప్రియతమా!

ఎ.మహాలక్ష్మి

ఈ విశాల భారతదేశంలో ఓ సగటు ఆడపిల్లను నేను. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నన్ను ఛీఛీ దరిద్రపు ముఖంది ఆడపిల్ల పుట్టింది గుండెలమీద కుంపటి పెట్టింది. అదే మగపిల్లవాడైతే మన కష్టాలన్నీ తీరును కదా... అంటూ ఈసడించారు. అలా పుట్టగానే అందరి నిరసనలతో ప్రారంభమైంది నా జీవితం.

ఊహ తెలిసే కొద్దీ ఈ ప్రపంచంలో నేనంటే ఏమిటో, నా బ్రతుకంటే ఏమిటో తెలుస్తూ వచ్చింది. అందుకే నేను ఎవరికీ భారం తయారవకూడదని నిశ్చయించుకొని చదివించమని అడిగాను. మొట్టమొదటగా ఇంట్లోని వారిని నేను కోరుకున్నది అదొక్కటే...

ఏమ్మా! చదివి ఊళ్ళేలాలా! ఉద్యోగాలు చెయ్యాలా! చదువు వెలగబెడితే రేపు మా మాట వింటావా... అయినా రేపు మళ్లీ నీ అంత చదువుకున్నవాడికి కట్నాలు, కానుకలు ఇచ్చి పెళ్లిచేయలేం మేమేం లక్షాధికారులం కాదు. ఏ తలకు మాసిన వెధవకో కట్టబెడితే మాకు భారం తగ్గుతుంది అన్నారు. అసలు వీళ్లు నా తల్లిదండ్రులేనా అని ఆ క్షణాన అనిపించింది. మధ్యతరగతి కుటుంబాల్లో అంతే మరి! ప్రాధేయపడ్డాను. మొండికేసాను. ఏ కళనున్నారో ముందు నసిగినా తర్వాత ఒప్పుకున్నారు.

అలా నా జీవన పోరాటంలో మొదటి అడుగు వేశాను. సహజంగా చిన్నప్పటి నుండి నాలో వుండే చురుకుదనంవల్ల ఇప్పటివరకూ ఎవ్వరితోనూ స్నేహం పెంచుకోలేదు.

ఈ రోజునుండే నా కాలేజీ జీవితం మొదలు. ఇంట్లో పనంతా అయ్యేసరికి టైమైపోయింది. ఆదరా బాదరా తయారై పరిగెత్తాను. అందరూ క్లాసులకి వెళ్లిపోయినట్లు క్యాంపస్ అంతా నిశ్శబ్దంగా వుంది. దాదాపు పరిగెడుతున్నట్లు అడుగులేస్తున్నాను నేను. టర్నింగ్‌లో అదే వేగంతో పైనుండి వస్తున్నా ఓ వ్యక్తిని గమనించక సడన్‌గా ఆ వ్యక్తిని ఢీకొనడంతో నా చేతిలోని పుస్తకాలన్నీ చెల్లా చెదురుగా కిందపడ్డాయి.

క్షమించండి చూసుకోలేదు అంటూ బగబా పుస్తకాలు ఏరుకోవడం మొదలెట్టాను. అసలే హడావుడి కంగారు. మొదటి రోజే లేట్‌గా వెళ్తే ఎలా? అన్న కొందర్లో వున్నాను నేను. అక్కడే నిలబడి వున్న అతన్ని నేను పట్టించుకోలేదు. వెళ్తు వెళ్తు ఓసారి ఎందుకో తలతిప్పి చూసాను. అలాగే నిలబడి అతను వడివడిగా వెళ్లిపోయాను. అతని కళ్లల్లో ఏదో ఆకర్షణ శక్తి వుందనిపించింది.

నేను క్లాసుకి వెళ్లిన కొద్దిసేపటికి 'మే ఐ కమిన్ సర్' అన్న పిలుపుతో నోట్స్ రాసుకుంటున్న నేను తలెత్తాను. ఇందాక మెట్ల దగ్గర నేను ఢీకొన్న వ్యక్తి అతనిదీ ఇదే క్లాసు కాబోలు అనుకున్నాను.

తరువాత అప్పుడప్పుడూ అతన్ని గురించిన ఆలోచనలు నను వెంబడిస్తున్నా పట్టించుకోలేదు. కానీ అతనే నా జీవితం అనే నాటకంలో ముఖ్యపాత్ర అవుతాడని ఊహించలేదు.

ఓరోజు క్లాసులో తెలుగు లెక్చరర్ నరసింహమూర్తిగారు వెళ్తూ వెళ్తూ రేఖా... ఇదిగో అంటూ ఓ బుక్ అందించారు. ఇంతలో బెల్‌కొట్టారు. అందరూ ఒక్కొక్కరుగా బయటకెళ్తున్నారు.

నేనెప్పుడూ మాస్టారుగారికి బుక్ ఇచ్చానో గుర్తు రాలేదు నాకు. పేజీ తెరవగానే రేఖా సాగర్ అని వుంది. అర్థం కాలేదు నాకు. అది నా దస్తూరీ కాదు. ఇంతలో ఎక్స్‌క్యూజ్‌మీ అన్న పిలుపుతో తలెత్తి చూశాను.

అది నా పుస్తకం. పొరపాటున మీ చేతికి వచ్చింది అంటూ నా చేతిలోని పుస్తకం తీసుకొని వడివడిగా వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయిన తర్వాత కొద్ది క్షణాలకు అర్థమైంది. అతని పేరు సాగర్ అని ప్రక్కన వున్నది నా పేరని.

బంటరి అలలా ప్రయాణిస్తున్న నా జీవన పథంలోకి నా అనుమతి లేకుండా ప్రవేశించాడు సాగర్. ఈ లోకంలో నా కోసం ఆలోచించే ఓ వ్యక్తి ఉన్నాడన్న ఊసే అప్పుడప్పుడు నాకు సంతృప్తిని కలిగిస్తోంది. నాకు తెలీకుండానే నా చూపు అటు మళ్ళింది.

నాలుగు కళ్లూ కలవగానే నాలో ఏదో కలవరం. ఒక్కరోజు అతను కనిపించక పోయినా మనసు విలవిలలాడేది. ఓ సంవత్సరం మౌనగీతంలో గడిచాక...

లైబ్రరీలో ఓ మూల కూర్చుని చదువుకుంటున్న నాకు సమీపంగా ఎవరిలో అడుగులచప్పుడు తలెత్తి చూసాను. సాగర్... నాలో ఏదో కంగారు దగ్గరగా వచ్చి రేఖా... అని పెదవులు విడీ విడవడనట్లుగానే నా పేరును అస్పష్టంగా పలికి నా చేతిలో ఓ లేత గులాబీ రంగు కాగితాన్ని పెట్టి వడివడిగా వెళ్ళిపోయాడు సాగర్. మొట్టమొదటిసారిగా అతను నన్ను పలకరించింది అప్పుడే... వణుకుతున్న చేతులతో విప్పాను ఉత్తరం.

రేఖా... నిను చూడగానే నా మనసు నీవైపు పరుగులు తీస్తోంది. నీ జీవితం ఏంటో నీ పరిస్థితి ఏమిటో తెలుసు. అయినా నీతో జీవితం పంచుకోవాలని నిశ్చయించుకున్నాను. అంగీకరిస్తావు కదూ...

సాగర్...

అని వుంది. కానీ నాకు సమాధానం అంత త్వరగా దొరకలేదు. నా జవాబుకై సాగర్ ఎదురు చూస్తుంటాడని తెలిసినా, ఆ తర్వాత నాలుగు రోజులు వరుసగా కాలేజీకి వెళ్లలేకపోయాను. అలా అని ఇంట్లోనూ కుదురుగా వుండలేకపోయాను.

మరుసటి రోజు కాస్త పొందలకడే తయారై కాలేజీకి వెళ్లాను. అదే పొగడచెట్టు నీడన సాగర్. తడబడుతూ అతనివైపు అడుగులు వేశాను. అతని కళ్లల్లోకి చూసాను. నా అభ్యర్థన నీవు తిరస్కరిస్తే నేను జీవించగలనా అన్నట్లు అతని కళ్లల్లో లీలగా కన్నీటి పొర.

నెమ్మదిగా అతని చేయందుకొని నా చేతిని వేశాను అదే సంకేతమన్నట్లుగా... సాగర్ కళ్లల్లో కోటి పున్నముల వెలుగులు. జీవితం రంగురంగుల స్వప్నంలా కనిపించసాగింది. నాకు. అలా ఊహించుకున్నా నా అభిప్రాయం తప్పని విధి నా జీవితంలో వింత నాటకం ఆడబోతోందని కొద్ది రోజులకే తెలిసింది సాగర్ వాళ్ల అమ్మ రాధమ్మ రాకతో...

రేఖా... నీతో మాట్లాడాలి... కొద్దిసేపు నా కోసం బయటికి రాగలవా అంది తనను తాను పరిచయం చేసుకుంటూ.... ఆంటీతో బయటికి వచ్చాను ఏదో తెలియని కంగారు నాలో... మొద్దు! వాళ్ల అమ్మతోపాటు తనూ రాకూడదూ ముద్దుగా విసుక్కున్నాను సాగర్‌ని మనసులో... ఏం చెప్పి వుంటాడబ్బా... అయినా ఇంత త్వరగా చెప్పేశాడా మా విషయం అని ఆలోచిస్తుండగా...

రేఖా... సాగర్ నీ గురించి అంతా చెప్పాడు. నీతో కొంచెం మాట్లాడదామని వచ్చాను అంది రాధమ్మ ఆంటీ... అంతే నా మనసు పురి విప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఆనంద సాగరంలో తేలిపోయాను. ఆంటీ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. చూడు రేఖా... నేను చెప్పేది విని తీరిగ్గా ఆలోచించుకుని సమాధానం చెప్పు అంది ఆంటీ. అర్థం కాలేదు నాకు... ప్రశాంతంగా కూర్చొని విను అంటూ రేఖా... నాకున్నది సాగర్ ఒక్కడే. వాడి తర్వాత ఇంకా పెళ్లికెదిగిన ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. భర్తను కోల్పోయిన నాకు నా పిల్లలకు వాడే జీవనాధారం. వాడు ఇంకా వృద్ధిలోకి రావలసిన వాడు. ఇప్పుడు నిన్ను ఇష్టపడుతున్నానని నాతో జీవితం పంచుకోవాలనుకుంటున్నానని తెలియజేశాడు. కాని నా పరిస్థితి అర్థం చేసుకొ... నిన్ను చేసుకుంటే మీ ఇంట్లో కట్నం రూపేణా పైసా రాదు. ఈ ఆడపిల్లల బాధ్యత నేనొక్కదాన్నే తీర్చుకోలేను. దయచేసి వాడి జీవితం నుండి తప్పుకో అంటూ చేతులు పట్టుకుంది కన్నీళ్లతో ఆంటీ... నా కళ్లనుండి రక్తాశ్రువులు ప్రవహిస్తున్నాయి. ప్రపంచమంతా శూన్యమై ఒంటరిగా నేను మాత్రమే మిగిలినట్లు హృదయంలో అల్లకల్లోలం... కాని గుండె దిటవుపరచుకొని ఆలోచించాను. నేనూ ఓ ఆడపిల్లనే... వారి పరిస్థితి అర్థం చేసుకోగలను అందుకే...

ఆంటీ! ప్రేమంటే ఏమిటో తెలీని నాకు తొలిసారి సాగర్ సాన్నిహిత్యంతో మనసుకు స్వాంతన లభించింది. మీ పరిస్థితి గురించి సాగర్ నాతో చెప్పలేదు. నా జీవితం ఇంతే అని సరిపెట్టుకుంటాను. నేనేం చేయాలో చెప్పండి ఆంటీ అన్నాను జీవం లేని నవ్వు నవ్వుతూ...

రేఖా... మీ ఎగ్జామ్స్ అయిపోయాయి కదా మేము ఈ ఊరినుండి దూరంగా వెళ్లి పోదామనుకున్నాం. నిన్ను చూస్తే నాకు చాలా బాధగా వుంది. కాని వాడు ఇక్కడే వుంటే నిన్ను చూడకుండా వుండలేడు. అందుకే ఏదో ఓ కారణం చెప్పి వాడిని తీసుకెళ్తాను. నీకు ఎప్పుడైనా ఇబ్బందిగా వుంటే నాకు తెలియజేయి డబ్బు పంపిస్తాను అంటూ అడ్రస్ ఇచ్చింది ఆంటీ... వస్తాను ఆంటీ... అంటూ సెలవు తీసుకున్నాను.

నా మీద నాకే జాలేసి అడ్రస్ చించివేశాను దారిలో... చిత్రంగా నా కళ్లనుండి కన్నీరు ప్రవహిచడం మానేసాయి. స్టేషన్‌కి వెళ్లకూడదని నిశ్చయించుకున్నాను. కాని కేవలం ఒకసారి నా సాగర్‌ని కళ్లనిండా చూసుకోవాలనిపించింది.

పరుగులు తీసాను స్టేషన్‌కు ఒక్కో కంపార్ట్‌మెంట్‌లోకి తొంగి చూస్తూ నడుస్తున్నాను. అడుగులు తడబడు తున్నాయి. ఆయాసంతో ఛాతీ ఎగసిపడుతోంది. కళ్లనిండా నీరు నిండి అంతా మసగ్గా కనిపిస్తోంది. ప్రియతమా! ఒక్కసారి కనిపించవో... నా శరీరంలో శక్తి నశించిపోతోంది. నీ రూపాన్ని చివరిసారి గా చూడాలని నా మనసు తహతహ లాడుతోంది. నా సాగర్‌ని కలుసుకోవాలని ఈ లేత హృదయం ఘోషిస్తోంది. అప్పటికే నేను వేసుకున్న స్లీపింగ్ టాబ్లెట్స్ నాపై తమ ప్రభావం చూపటం మొదలెట్టాయి.

చివరిసారిగా సాగర్‌ని చూస్తానో లేదో అనుకుంటూ ఎదురుగా వున్న రాయిని చూసుకోక పట్టుతప్పి 'అమ్మా' అంటూ కిందపడ్డాను. బొటన వ్రేలు చితికి రక్తం వస్తోంది. అప్పుడే టాప్ దగ్గర బాటల్‌లో మంచినీరు నింపుకొని వస్తున్న సాగర్ నన్నుచూసి పరుగు పరుగున నా దగ్గరకు చేరుకున్నాడు.

వచ్చావా నేస్తం! నిన్ను చూడని క్షణాలు యుగాలైనట్లుగా వుంది. మనసు మూగగా రోదిస్తోంది. సాగర్ రూపం మసగ్గా కనిపిస్తోంది. క్రిందపడ్డ నన్ను తన ఒళ్లోకి తీసుకున్నాడు సాగర్. ఏమైంది రేఖా? ఎందుకిలా అయిపోతున్నావు నీవు. రేఖా... రేఖా... అంటూ నా తలను హృదయానికి హత్తుకొని చిన్న పిల్లవాడిలా కన్నీరు కార్చాడు సాగర్. అంతవరకు బలంగా బిగించిన నా పిడికిలి విప్పి ఓ కాగితం అందించాను శరీరంలో శక్తినంతా కూడగట్టుకుని...

నాకు దూరమవుతున్న నా ప్రియేస్తానికి,

కన్నీళ్లతో వ్రాస్తున్న ఉత్తరం ప్రేమంటే ఎరుగని ఈ శిలకు మమతాను రాగాల్ని పంచి మనిషిని చేశావు. నీతోనే నా జీవితం అనుకుని నా స్వార్థం నేను చూసుకున్నానే తప్ప నీవైపు నుండి ఆలోచించలేక పోయాను. ఇప్పుడే తెలిసింది. అశకూ ఓ హద్దుండాలని... నీవు నింగిలోని జాబిలివి ఎక్కడో ఏటి ఒడ్డున నేలపై పూచిన గడ్డి పూవును నేను. నీకూ నాకూ మధ్య ఎంత అంతరం. ఇవేమీ ఆలోచించక ఊహల్లో విహరించాను. నిన్ను తప్పి ఇంకెవరినీ జీవితంలోకి ఆహ్వానించలేను. నేనంటూ ఈ లోకంలో వుంటే నీవు మరో స్త్రీని వివాహం చేసుకోలేవు. ఏనాటికైనా నా కోసం ఎదురుచూస్తావని తెలుసు. అందుకే శాశ్వతంగా దూరమైతే నీవు జీవితంతో రాజీపడలేవని నిశ్చయించుకున్నాను. ఈ ప్రపంచాల అంచులు దాటి నీకు దూరంగా వెళ్లిపోతున్నాను నేస్తం!

నేను స్వార్థపరురాలిని కదూ! మన్నించు ప్రియతమా.

మరో జన్మంటూ వుంటే నీతో జీవితం పంచుకోవాలనుకునే నీ రేఖ.

ఉత్తరం చదివి నావైపు అయోమయంగా చూసాడు సాగర్. ఎంతపని చేశావు రేఖా. ఒక్కమాట నాతో చెప్పకుండా నిండు జీవితాన్ని ఎందుకు బలి చేసుకున్నావు అంటూ రోదించసాగాడు సాగర్.

కళ్లు తెరవలేకపోతున్నాను. నాలోని శక్తినంతా ఎవరో లాగేస్తున్నట్లుగా వుంది. సాగర్ ఏడవటం సన్నగా వినిపిస్తోంది వెళ్లిపోవాలి తప్పదు. ఈ లోకంలో నా పాత్ర అయిపోవచ్చిందని నాకు తెలుస్తోంది.

రేఖా... ఐ లవ్ యూ అంటూ సాగర్ నా నుదుడిపై పెట్టిన తొలిముద్దు మాత్రం నాకు లీలగా గుర్తుంది అంతే...